

ఒక్క హామీనైనా అమలు చేశారా?

కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలవుతున్నా ఒక్క హామీనైనా అమలు చేసిందా? అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ధ్వజమెత్తారు. - 8లో



కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0 /18.0

జిల్లాలో సోమవారం 18.0 - 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

నేడు, రేపు అంతర్జాతీయ సదస్సు

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మంగళ,బుధవారాల్లో 'తెలుగులో రామాయణాలు – సామాజిక దృక్పథం'అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ కె. కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారని తెలిపారు. సదస్సుల్లో దేశ విదేశాలకు సంబంధించిన ప్రతినిధులు, సాహితీవేత్తలు 60 మంది పరిశోధనా పత్రాలు సమర్పణ చేస్తారన్నారని తెలిపారు. విదేశాల ప్రతినిధులు, పత్ర సమర్పకులు అంతర్జాలం ద్వారా కూడా పాల్గొంటారని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం 5–30 గంటలకు భారతీయ నృత్య సంస్థాన్‌కు చెందిన 30 మంది నృత్య కళాకారులు 'సీతారామ కల్యాణం'నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తారన్నారని ఆమె వివరించారు.

కందుల కొనుగోళ్లు ప్రారంభించండి
– జేసీ అదితి సింగ్



కొనుగోలు కేంద్రాల్లో ఉన్న పరికరాలను పరిశీలిస్తున్న జేసీ అదితి సింగ్

కమలాపురం : కందుల కొనుగోళ్లు ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. కమలాపురం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. దిగుబడులు కొనుగోలు చేసేందుకు అవసరమైన అన్ని పరికరాలు, సంచులు తదితర సామగ్రి ఉందా? అని సిబ్బందితో ఆరా తీశారు. ఏ మేరకు దిగుబడులు రావచ్చని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్షణం కొనుగోళ్లు ప్రారంభించాలని ఆదేశించారు. మార్కెటింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పరిమళ జ్యోతి, ఏడీఏ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : కడపజిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ నిత్యానందరాజులు తెలిపారు. గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీఓ), ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ కో–ఆర్డినేటర్ (ఐఈ కో–ఆర్డినేటర్), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్(ఏఎస్ఓ) పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. పూర్తి చేసిన దరఖాస్తులను అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ కడప ఎన్‌జీఓ కాలనీలోని సమగ్రశిక్ష కార్యాలయంలోని అందచేయాలని తెలిపారు. పూర్తి సమాచారం, వివరాల కోసం కార్యాలయ పనివేళల్లో సమగ్రశిక్ష కార్యాలయ ఏపీసీని సంప్రదించాలని తెలిపారు.

రాజంపేట మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్

రాజంపేట : రాజంపేట పురపాలక సంఘం కమిషనర్ బి. నాగేశ్వరరావు సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు సోమవారం పట్టణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులను జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం, ప్రభుత్వ ఆదేశాలను ఖాతరు చేయకపోవడం, క్షేత్రస్థాయిలో పర్యటించకుండా కార్యాలయానికే పరిమితి కావడం, ఇతర కారణాలతో ఆయనను సస్పెండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో పల్లకి సేవ

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాత్రి మూలవిరాట్‌కు స్వామివారికి అర్చకులు పూజలు జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులను రంగురంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు.పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢవీధులు, ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు.భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.కార్యక్రమంలో ఈవో డీవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : పోషణ్ బీ, పడాయి బీ కార్యక్రమం అమల్లో భాగంగా జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం నుంచి శిక్షణ ఇవ్వనున్నామని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 13 ప్రాజెక్టులలో 2389 అంగన్వాడీ కేంద్రాలలో శిక్షణ ఉంటుందని వివరించారు.

గల్ఫ్‌యానం.. గగనం



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి కువైట్ ఎంబసీ మిసాల్ ముసాపా అల్-షామితి..ఆయనను తిరుపతి ఎంపీ గురుమూర్తి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి కలిశారు. కువైట్ నుంచి విమానాలు తిరుపతి రన్‌వేపైకి తీసుకురావాలని కోరారు. ఉభయ వైఎస్సార్ జిల్లాలో రెండు లక్షలకుపైగా కువైట్‌లో జీవనోపాధి కోసం వెళుతుంటారు..వస్తుంటారు..వీరిని దృష్టిలో వుంచుకొని ఎడారి విమానం తిప్పాలని విన్నవించారు.

తిరుపతి రన్‌వేపైకి.. ఎడారి విమానాలెప్పుడో!

- ఎదురుచూపుల్లో ఉభయ జిల్లాల గల్ఫ్‌వాసులు
- ఇప్పటికైనా కేంద్రం కరుణించేనా!



తిరుపతి ఎయిర్‌పోర్టు

రాజంపేట : ఉభయ వైఎస్సార్ జిల్లా నుంచి ఎడారి దేశాల విమానాలకు రెక్కలొచ్చేదెప్పుడోనని గల్ఫ్‌వాసుల కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. రాష్ట్రం నుంచి కేంద్ర పౌర విమానాయనశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న రామ్మోహన్‌నాయుడుపై తిరుపతి ఎయిర్‌పోర్టులో ఎడారిదేశాలకు విమానయాన సౌకర్యం కల్పించే బాధ్యత పడింది. ఇవి తిరుపతి రన్‌వేపై ఎగిరితే తమ పయనానికి ఇక ఇక్కట్లు ఉండవని వేయికళ్లతో వలసజీవులు ఎదురుచూస్తున్నారు.అయితే పౌరవిమానాయన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సముద్రయానం నుంచి విమానాల దాకా..

గల్ఫ్‌దేశాలకు వెళ్లేవారు నాలుగు దశాబ్దాల కిందట సముద్రయానం ద్వారా చేరుకునేవారు. వారాల కొద్దీ పయనించి ఎడారిదేశాలకు చేరుకునేవారు. అప్పట్లో గల్ఫ్ జీవనోపాధికి డిమాండ్ లేని రోజుల్లో మాట ఇది. రానురాను అక్కడ పనిచేసే ఉన్నతంగా జీవనం సాగించవచ్చని, తమ కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావచ్చనే భావనతో ఎడారి పయనాలు అధికమయ్యాయి. ముఖ్యంగా రాజంపేట, రాయచోటి, కడప, బద్వేలు, రైల్వేకోడూరుతో పాటు ఉభయ జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి 2 లక్షల మంది ఎడారిదేశాలపై ఆధారపడి జీవిస్తున్నారు

కరోనా సమయంలో గల్ఫ్‌లో కరోనా సోకిన వారిని విమానాల ద్వారా తిరుపతి ఎయిర్‌పోర్టుకు చేర్చారు. అప్పట్లో ఏపీఎస్‌ఆర్‌టీ ద్వారా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో కేంద్రప్రభుత్వం గల్ఫ్‌లో కరోనా బాధితులను క్షేమంగా స్వదేశానికి తీసుకొచ్చారు. తిరుపతి ఎయిర్‌పోర్టుకు నేరుగా విమానాల్లో తీసుకొచ్చి, వారిని జిల్లాలో ఏర్పాటు చేసిన కరోనా నివారణ శిబిరాల్లో ఉంచి, తర్వాత ఇళ్లకు క్షేమంగా చేర్చిన సంగతి విధితమే. కాగా అంతర్జాతీయసర్వీసులు తీసుకొచ్చేందుకు గత రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఏడీసీఎల్) ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత అధ్యాత్మిక నగరం తిరుపతి నుంచి అంతర్జాతీయస్థాయిలో విమాన సర్వీసులు ప్రారంభమవుతాయన్న కలలు ఇంకా కలలాగే మిగిలిపోతున్నాయి.

వ్యయప్రయాసలతో .

చెన్నై, కర్ణాటక, ముంబై, హైదరాబాద్, ఢిల్లీ నగరాలకు వ్యయప్రయాసలతో వెళ్లాల్సి వస్తోంది. ఫలితంగా అనేక మంది భాష రాక ఇబ్బందులు పడుతున్నారు. కొందరైతే మోసపోతున్నారు. దూరప్రయాణంతో అనేక అవాంతరాలు, ప్రమాదాలబారిన పడుతున్నారు.విమాన టికెట్‌తో పాటు ఎయిర్‌పోర్టుకు చేరుకునే ఖర్చులు భరించలేకపోతు న్నారు. 2015లో తిరుపతి విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పించారు. కానీ ఆ స్థాయిలో విమాన సర్వీసులను తీసుకురాలేదన్న అపవాదును కేంద్రప్రభుత్వం మూటకట్టుకుంది.

ఉభయ జిల్లాల నుంచి..

రాయలసీమలో ప్రధానంగా ఉభయ వైఎస్సార్ జిల్లాల నుంచి ఎడారిదేశాలకు వెళ్లేవారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. జీవనోపాధికోసం కువైట్, ఖత్తర్, దుబాయ్, సౌదీ అరేబియా,బహ్రెయిన్, అబుదాబి, లెబనాన్, మస్కట్ దేశాలకు వెళతారు. ఉద్యోగరీత్యా, విద్య కోసం అమెరికా, కెనడా, సౌతాఫ్రికా,శ్రీలంక, ఆస్ట్రేలియాల్లో స్థిరపడిన వారు ఉన్నారు. వీరు కూడా విదేశీయానం చేయాల్సివస్తే కష్టతరంగానే ఉంది. భాష రాని వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాణించాలంటే గగనమవుతోంది. గల్ఫ్‌దేశాలకు వెళ్లే వారు అధికంగా 60 శాతం చదువురాని వారు ఉన్నారు. మోసాలపాలైన వారు చాలామంది ఉభయ జిల్లాలో ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎంపీలు గతంలోనే ప్రయత్నాలు..

తిరుపతి, రాజంపేట లోక్‌సభ సభ్యులు తమ వంతుగా అంతర్జాతీయ విమాన సర్వీసులను రన్‌వే మీదకు తీసుకొచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తిరుపతి నుంచి విదేశీయానంపై ప్రత్యేక దృష్టి సారించారు. అయితే ఈ విషయంలో కేంద్రప్రభుత్వం కనికరించలేదు. ఫలితంగా రాయలసీమవాసులకు విదేశీయానం గగనతరంగా మారింది. తాజాగా రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తిలు కువైట్ ఎంబసీని కలిసి గల్ఫ్ విమానాలు తిరుపతి విమానశ్రయం నుంచి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గల్ఫ్ విమాన సర్వీసులు తీసుకురావాలి



తిరుపతి ఎయిర్‌పోర్టులో విదేశీ విమాన సర్వీసులను తీసుకొచ్చేందుకు వైస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రయత్నాలు జరిగాయి. ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై ఇప్పటి వరకు కరుణించలేదు. గల్ఫ్‌వాసులకు విమానయాన సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. గత రాష్ట్ర ప్రభుత్వం , ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రయత్నాలు చేశాయి.

– పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

కేంద్రం తక్షణమే స్పందించాలి



రాయలసీమ జిల్లా వాసులకు అందుబాటులో ఉండే తిరుపతి ఎయిర్‌పోర్టు నుంచి విదేశీ విమాన సర్వీసులను ప్రవేశపెట్టాలి.దీనిపై కేంద్రప్రభుత్వం స్పందించాలి. ఆ దిశగా అడుగులు వేయాలి. విదేశాలకు వెళ్లాలంటే ఇతర రాష్ట్రాల వైపు చూడాల్సి వస్తోంది. చెన్నై, బెంగళూరు తదితర రాష్ట్రాలకు చెందిన విమానశ్రయాల ద్వారా వెళ్లాలంటే కష్టతరంగా ఉంది. కువైట్ ఎంబీసీకి తిరుపతి ఎంపీతో కలిసి ఈ విషయం తెలియజేశాం. కనీసం కడపోళ్ల కోసం కువైట్ నుంచి విమానం నడిపించాలి

– మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు

రంగ రంగ..వైభవంగా!



రథంలో కొలువుతీరిన సతీసమేత శ్రీరంగనాథుడు



పురవీధులలో శ్రీరంగనాథుని తేరోత్సవం

- కదిలింది బ్రహ్మారథం
- దారిపొడవునా గోవిందా నామస్మరణలు, భజనలు

పులివెందుల : పులివెందుల పట్టణంలో శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీరంగనాథస్వామి రథోత్సవ వేడుకలు కనుల పండువగా జరిగాయి. రథోత్సవ వేడుకలను తిలకించేందుకు పట్టణ పరిధిలోని భక్తులతోపాటు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి కాయ కర్పూరాలు సమర్పించారు. స్వామి వారి తేరు (రథం) కింద గుమ్మడికాయలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. దారి పొడవునా గోవింద నామస్మరణలతో రథాన్ని కదిలించారు. తేరు ప్రారంభానికి ముందు అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ విశేష పూజలు జరిపించారు. ఉభయదారులకు అర్చనలు చేశారు. తేరు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డితోపాటు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మెన్ చిన్నప్ప, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, మాజీ బలిజ సంఘం అధ్యక్షుడు సోపాల వీరా, వివిధ శాఖల అధికారులతో స్వామి వారికి పూజలు జరిపించారు. ఆలయ మర్యాదలతో ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ వెంకటరమణ వారికి శాలువతో సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు. రథోత్సవం స్థానిక పూలంగళ్ల సర్కిల్ నుంచి కొనసాగి శ్రీనివాస హాలు రోడ్డు, ముత్యాల వారి వీధి, గుంత బజార్, బంగారు అంగళ్ల మీదుగా తిరిగి పూల అంగళ్ల సర్కిల్‌కు చేరుకుంది. రథోత్సవ సందర్భంగా ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పర్యవేక్షించారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో ఎస్పీ ఈజీ అశోక్ కుమార్



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) లో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి, వారి సమస్యను విన్నారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) శ్రీ కె. ప్రకాష్ బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, మహిళా పి.ఎస్ డి.ఎస్పీ రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి

హోం గార్డ్స్ సిబ్బంది విధుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందించుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ సూచించారు. జిల్లాలోని హోం గార్డు సిబ్బందికి రెండు వారాల పాటు నిర్వహించే మొబిలైజేషన్ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోం గార్డ్ విధుల్లో చేరేముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. మొబిలైజేషన్ లో ట్రాఫిక్ రెగ్యులేషన్, పర్సనాలిటీ డెవలప్ మెంట్, ఫిజికల్ ఫిట్ నెస్, మాబ్ కంట్రోల్, బందోబస్తు విధులు, డ్రిల్ తదితర అంశాల్లో తర్ఫీదు ఇస్తామని ఎస్పీ తెలిపారు. మొబిలైజేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్.పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, అదనపు ఎస్.పి (ఏ.ఆర్) బి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్‌ఐ లు శ్రీశైల రెడ్డి, ఆనంద్, వీరేష్, ఆర్‌ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, హోమ్ గార్డులు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ప్రజలు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సభా భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

- సీకే దిన్నె మండలం ఊటుకూరు గ్రామ పొలం సర్వే నెంబరు 182/3ఏ1, 182/3ఏ2, 182/3ఏ3, 182/3ఏ5లోని రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని అర్హులైన ఎస్సీ ఎస్టీలకు ఇంటి స్థలాలుగా ఇవ్వాలని దళిత భూ సాధన పోరాట సమితి అధ్యక్షులు ఓబులపతి, నాయకులు ఆర్‌ఎస్ రాజు, వెదురూరు బాబు తదితరులు కోరారు.
- విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నరసింహులు అనే వ్యక్తి 4 ఎకరాల 55 సెంట్ల తన పట్టా భూమిని ఆక్రమించాడని, ఆయనపై చర్యలు తీసుకుని తన భూమి తనకు అప్పగించాలని సింహాద్రిపురం మండలం బిదినంచర్ల గ్రామానికి చెందిన చిన్న గంగన్నగారి నారామ్మ అనే వృద్ధురాలు కలెక్టర్‌ను వేడుకున్నారు.
- అంగన్వాడీ సెంటర్ల అవసరాల కోసం ప్రభుత్వం ఒక్కో సెంటర్‌కు రూ. 3000 చొప్పున ఇచ్చిందని, ఆ మొత్తాన్ని వినియోగించడంలో అవకతవకలు జరిగాయని, వాటిపై విచారణ నిర్వహించి బాధ్యులపై తగు చర్యలు చేపట్టాలని సీఐటీయూ నాయకులు మనోహర్, చంద్రారెడ్డి తదితరులు విన్నవించారు.
- కడప దౌలతాపురానికి చెందిన నాగరాజు పెన్షన్ మంజూరు చేయాలని అభ్యర్థించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, మెప్మా పీడీ, ఎస్డీసీ వెంకటపతి పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలను అరికడదాం

విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు వీడియో, ఆడియో, వాల్‌పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేబుల్ నెట్వర్క్, టీవీలు, ప్రొజెక్టర్ల ద్వారా విద్యుత్ భద్రత నియమాలు గురించి ప్రదర్శనలు నిర్వహిస్తే ప్రజల్లో మరింత అవగాహన పెరుగుతుందన్నారు. ప్రతి ఇంటికి విధిగా ఎర్తింగ్, ప్రమాణాలు కలిగిన విద్యుత్ పరికరాలను వాడాలన్నారు. అలాగే వ్యవసాయ బోర్ల వద్ద భద్రత నియమాలు విధిగా పాటించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, జెడ్పీ సీఈవో ఓబులమ్మ, విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్ రమణ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు స్థలంపై కన్నేశారు

- రూ.కోట్లు విలువైన స్థలాన్ని చౌకగా కొట్టేసే యత్నం..
- టీడీపీ నేతల క్రియాశీలక పాత్ర



రూ.కోట్లు విలువైన వక్ఫ్‌బోర్డు స్థలం

ప్రొద్దుటూరు : కోట్ల రూపాయల విలువైన వక్ఫ్‌బోర్డు స్థలాన్ని లీజు రూపంలో తక్కువ ధరకు తీసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధికార టీడీపీ నేతలు ఇందులో క్రియాశీలకంగా ఉన్నారు. వక్ఫ్‌బోర్డుకు సంబంధించి ప్రొద్దుటూరు పట్టణంలోని మోడంపల్లె మసీదు పరిధిలో సుమారు 27 ఎకరాల పొలాలు, స్థలాలు ఉన్నాయి. ఇందులో కోట్ల రూపాయల విలువైన స్థలాలు పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ఎక్కువగా ఉన్నాయి.

కమర్షియల్ ఏరియాలో..

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానికంగా వక్ఫ్‌బోర్డుకు సంబంధించి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. గత ఏడాదిలో 9 మందితో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. వక్ఫ్‌బోర్డుకు సంబంధించి సర్వే నంబర్ 293/2లో 39 సెంట్ల స్థలం ఉంది. మొత్తం 40 సెంట్ల స్థలంలో సెంటు స్థలం బైపాస్ రోడ్డు నిర్మాణానికి పోగా మిగిలిన 39 సెంట్లు అలాగే ఉంది. గతంలో వక్ఫ్‌బోర్డు అధికారులు తమ స్థలమని బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ స్థలానికి ఎదురుగా ప్రముఖ థియేటర్ ఉంది. ఈ ప్రాంతమంతా ప్రస్తుతం కమర్షియల్ హబ్‌గా మారింది. కోట్ల రూపాయల విలువైన స్థలం కావడంతో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి పరిధిని పెంచారు. ప్రభుత్వ అనుమతి లేకుండా వక్ఫ్‌బోర్డు అధికారులు ఈ స్థలాన్ని లీజుకు ఇవ్వరాదని నిర్ణయించారు.

లోపాయికారి ఒప్పందం..

తాజాగా ఈ స్థలాన్ని వెలవలి హుస్సేన్ పీరా అనే వ్యాపారి తక్కువ ధరతో లీజుకు తీసుకునేందుకు దరఖాస్తు చేశారు. లోపాయికారిగా టీడీపీ నేతలతో ఒక ఒప్పందం జరిగినట్లు సమాచారం. మోడంపల్లె మసీదు మేనేజింగ్ కమిటీ ద్వారా ఈ దరఖాస్తును విజయవాడలోని వక్ఫ్‌బోర్డు కార్యాలయానికి పంపారు. ప్రొద్దుటూరు ప్రాంతంలో మైనారిటీ సంస్థల ఆస్తుల పరిరక్షణకు పోరాటం చేస్తున్న కొందరు ఈ విషయాన్ని గమనించారు. బయటికి తెలియకుండా ఒకే దరఖాస్తును తీసుకుని ఎలా పంపారని ప్రశ్నించారు. ఈ విషయం బయటికి పొక్కడంతో మరుసటి రోజే మోడంపల్లె మసీదులో ఈ స్థలాన్ని లీజుకు ఇచ్చే విషయమై నోటీసు బోర్డులో పెట్టారు. అధికార పార్టీకి చెందిన ఓ థియేటర్ యజమాని స్థలాన్ని తీసుకునేందుకు ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై మోడంపల్లె మసీదు మేనేజింగ్ కమిటీ కార్యదర్శి షకిల్ అహ్మద్‌ను 'సాక్షి' వివరణ కోరగా గతంలో వెలవలి హుస్సేన్ పీరా నుంచి వచ్చిన దరఖాస్తును వక్ఫ్‌బోర్డు కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. నెలకు రూ.40వేలు చొప్పున లీజుకు ఇవ్వాలని ఆయన దరఖాస్తు చేశారన్నారు. ప్రస్తుతం మరో ఇద్దరు ఈ స్థలం కోసం దరఖాస్తు చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. స్థలాన్ని లీజుకు ఇచ్చే విషయంపై తుది నిర్ణయం వక్ఫ్‌బోర్డు పరిధిలో మాత్రమే ఉంటుందని, తమకు సంబంధం లేదన్నారు.

క్లుప్తంగా

విషద్రావణం తాగిన వ్యక్తి మృతి



నీలం సుబ్బరాయుడు (ఫైల్)

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన నీలం సుబ్బరాయుడు అనే వ్యక్తి ఆదివారం రాత్రి విషద్రావణం తాగాడు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు చింతకొమ్మదిన్నె పోలీసు స్టేషన్ సీఐ శివశంకర్ నాయక్ తెలిపారు. మృతుడు అతని మొదటి భార్య, కుమార్తె కుటుంబ సమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెంది ఈ చర్యకు పాల్పడినట్లు తెలిపారు.

పొలాల్లోకి వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి



చిరుత పులుల సంచారంపై అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

లింగాల : పొలాల్లోకి వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఫారెస్ట్ అధికారులు శ్రీనివాసులు, మహబూబ్ బాషా, గోపాలకృష్ణ రైతులకు సూచించారు. సోమవారం మండల కేంద్రమైన లింగాలలో రైతు వాసుదేవరెడ్డి పొలంలోని పులి అడుగు జాడలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు చిరుత పులి అడుగు జాడలపై ప్రజలకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ పోలీసు స్టేషన్ పరిధిలో నాగముని (45) అనే మహిళ సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ప్రసాద్‌కు కళ్లు సరిగా కనపడవు. టిఫెన్ సెంటర్ పెట్టుకుని జీవనం సాగించేవారు. మృతురాలి కుమారుడు దీపక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తన తల్లి చిన్నచిన్న సమస్యలకు కూడా మానసికంగా బాధపడేదని, క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినూత్న రీతిలో పశువైద్య విద్యార్థుల నిరసన



గేదెకు వినతి పత్రం ఇస్తున్న పశువైద్య కళాశాల విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం గ్రామం వద్ద ఉన్న పశువైద్య కళాశాలలో సోమవారం కళాశాల విద్యార్థులు తమకు స్టైఫండ్ పెంచాలని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కళాశాలలోని పశువైద్య శాలకు వచ్చిన పాడి గేదెకు వారు వినతి పత్రం అందించి నిరసన తెలిపారు. ఎంబీబీఎస్ మెడికల్ విద్యార్థులతోపాటు సమానంగా తమకు కూడా స్టైఫండ్ పెంచే వరకు సమ్మెను విరమించమని విద్యార్థులు పేర్కొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడో?

- ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై కొరవడిన స్పష్టత
- మాటలకే పరిమితమైన హామీ
- పట్టించుకోని ప్రభుత్వం
- మోసపోయామని మహిళల ఆవేదన



కడప కోటిరెడ్డిసర్కిల్ : టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒకటి. ఎన్నికలకు ముందు మహిళలు ఎక్కడైనా ఉచితంగా ప్రయాణించవచ్చంటూ విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. టీడీపీ కూటమి నేతలు గద్దెనెక్కి ఎనిమిది నెలలు దాటినా హామీలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఉచిత బస్సు ప్రయాణం ఇక ఎప్పుడా అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేశాయి. తమిళనాడు రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పటినుంచో అమలులో ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో కూడా టీడీపీ అదే ఫార్ములాను అమలు చేసింది. ఉచిత బస్సు అంటూ జోరుగా ప్రచారం చేపట్టింది. అయితే ఈ ఉచిత బస్సు హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. చంద్రబాబునాయుడు ఉచిత బస్సు ప్రయాణమని ప్రజలను మభ్యపెట్టారని స్పష్టం కావడంతో మహిళలు ఉసూరుమంటున్నారు.

ఉచిత ప్రయాణంపై కానిరాని స్పష్టత

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటివరకు కనీసం స్పష్టత ఇవ్వలేదు. అయితే రోడ్డు రవాణాశాఖ మంత్రి త్వరలోనే అని చెప్పడం తప్ప ఎప్పటినుంచి ప్రారంభిస్తారో స్పష్టంగా చెప్పకపోవడం శోచనీయం. తొలుత గతేడాది ఆగస్టు 15 నుంచి అనడం, మళ్లీ మహిళలకు దీపావళి కానుకగా ఉచిత బస్సు ప్రయాణం అని వదంతులు సోషల్ మీడియాలో హల్‌చల్‌చేసిన విషయం అందరికీ తెలిసిందే. దీనికితోడు ఏకంగా చంద్రబాబు సైతం సూపర్ సిక్స్ హామీలైతే ఇచ్చాంగానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే భయమేస్తోందని వ్యాఖ్యానించడం మహిళల అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

పండుగల పేరుతో కాలయాపన

హామీ అమలుకు పండుగల పేరుతో కూటమి నాయకులు కాలయాపన చేస్తున్నారని పలువురు మహిళలు విమర్శిస్తున్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి అంటూ కప్పదాటు ప్రయత్నాలు చేస్తున్నారని దుమ్మెత్తి పోస్తున్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహిళలను ఆకర్షించేందుకే హామీ

జిల్లా వ్యాప్తంగా మహిళా ఓటర్లు 11,96,328 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అయితే రోజూ సగటున 50 శాతం మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని కూటమి నేతలు హామీలు ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఇతర హామీలతోపాటు ఈ హామీని తుంగలో తొక్కారు.

జిల్లాలోని మండలాల వారీగా మహిళా ఓటర్ల వివరాలు

మండలం	మహిళలు	బి.కోడూరు	10221
కడప	201694	బద్వేలు	27178
కొండాపురం	24150	గోపవరం	40796
మైలవరం	22714	అట్లూరు	9655
పెద్దముడియం	14917	చింతకొమ్మదిన్నె	33852
జమ్మలమడుగు	46585	పెండ్లిమర్రి	23670
ముద్దనూరు	18621	వల్లూరు	15001
ఎర్రగుంట్ల	47251	కమలాపురం	28768
రాజుపాలెం	17791	వీరపునాయునిపల్లె	17807
ప్రొద్దుటూరు	155885	చెన్నూరు	19948
మైదుకూరు	47278	చక్రాయపేట	15663
బి.మఠం	19774	వేంపల్లె	42098
ఖాజీపేట	26088	సింహాద్రిపురం	17564
చాపాడు	22153	లింగాల	15597
దువ్వూరు	27125	పులివెందుల	53436
కాశినాయన	17015	వేముల	16950
కలసపాడు	15392	తొండూరు	13950
పోరుమామిళ్ల	31280	ఒంటిమిట్ట	18278
		సిద్దవటం	20185

హామీ ఇచ్చేటప్పుడు భయం అనిపించలేదా?



ఎన్నికల ముందు హామీలు ఇచ్చే సమయంలో ఆచరణకు సాధ్యమా? అసాధ్యమా? అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి పీఠంలో కూర్చొని ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తోందని చెప్పడం సిగ్గుచేటు. హామీలు ఇచ్చేటప్పుడు బాబుకు భయం అనిపించలేదా? కూటమికి ఓట్లు వేసి మహిళలు మోసపోయారు.

\- టీపీ వెంకటసుబ్బమ్మ, జిల్లా మహిళా అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ

హామీలను నిలబెట్టుకోవాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదు. ఎప్పుడు అమలు చేస్తారో కూడా తెలియడం లేదు. పొరుగు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా ప్రభుత్వాలు అమలు చేశాయి. ఇక్కడ ఎందుకు అమలు చేయలేకపోతున్నారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేసి ఇప్పటికైనా మాట నిలబెట్టుకోవాలి.

\- బి.దీప్తి, నగర అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం

నమ్మక ద్రోహమే



కూటమి నేతల మాటలు నమ్మి మహిళలు ఓట్లు వేశారు. ఇప్పుడు హామీ అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారు. అమలు చేస్తారన్న నమ్మకం కూడా కనిపించడం లేదు. ఉచిత బస్సు ప్రయాణంపై స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. నమ్మి ఓట్లు వేసిన వారిని మోసం చేయడం నమ్మక ద్రోహమే. మహిళలకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలి.

\- బండి మరియలు, కోశాధికారి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం

గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను అడ్డుకున్న భూ నిర్వాసితులు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లేపల్లె పంచాయతీలో జరుగుతున్న బెంగళూరు–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనులను సోమవారం భూ నిర్వాసితులు మల్లేపల్లె దగ్గర అడ్డుకున్నారు. అధికార పార్టీ మల్లేపల్లె సర్పంచ్ చిలమల లక్ష్మీదేవి భర్త నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వాసితులతో రోడ్డు పనులను అడ్డుకున్నారు. రోడ్డు కోసం భూములు కోల్పోయిన తమకు తక్షణం నష్టపరిహారం జిల్లాలో ఇతర మండలాల్లో ఇచ్చిన విధంగా ఎకరాకు రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల నాయకుడు పెదుల్లపల్లె ప్రభాకర్ కార్యకర్తలతో కలసి మద్దతు పలికారు. తహసీల్దార్ దామోదర్‌రెడ్డి అక్కడికి చేరుకొని భూ నిర్వాసితులతో మాట్లాడారు. నష్టపరిహారం అధికంగా వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

శ్రీకృష్ణదేవరాయలను విస్మరించడం దారుణం

కడప కార్పొరేషన్ : విజయనగర సామ్రాజ్య చక్రవర్తి, రాయలసీమను రతనాల సీమగా మార్చిన శ్రీకృష్ణదేవరాయలకు కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి దండ వేయకపోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తోటక్రిష్ణ అన్నారు. సోమవారం స్థానిక మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విజయ నగర చక్రవర్తిగా ఆయన సుపరిపాలన అందించారన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి జయంతిని ప్రజలంతా ఘనంగా నిర్వహించారని, కడప ఎమ్మెల్యే మాత్రం ఆయనకు దండ వేయకపోవడం సరికాదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్, గుంటి నాగేంద్ర, రెడ్డి ప్రసాద్, ఉమామహేశ్వరి, సుదర్శన్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ, పోలీసు అధికారుల నిర్లక్ష్యంతోనే ఘటన

సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర



భాకరాపేట గుడిసెల్లో పర్యటిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

బద్వేలు అర్బన్ : పట్టణ పరిధిలోని భాకరాపేట సమీపంలో సీపీఐ ఆధ్వర్యంలో వేసిన గుడిసెలలో ఆదివారం చోటు చేసుకున్న ఘటనకు రెవెన్యూ, పోలీసు అధికారుల నిర్లక్ష్యమే కారణమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర ఆరోపించారు. సోమవారం భాకరాపేట గుడిసెలలో మృతదేహాన్ని పూడ్చిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్మశానాలు, గ్రామాల అభివృద్ధికి సీపీఐ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, అయితే ఆదివారం చోటు చేసుకున్న ఘటన బాధాకరమని అన్నారు. కేవలం కొందరు భూకబ్జాదారులు మృతురాలి బంధువులను రెచ్చగొట్టి ఘర్షణ జరిగేలా చేశారని, తాము గ్రామస్తులకు వ్యతిరేకం కాదని అన్నారు. గత నెల రోజులుగా భాకరాపేట గుడిసెలను తొలగించాలని రెవెన్యూ, పోలీసు యంత్రాంగంపై కొందరు ఒత్తిడి తీసుకువస్తున్నారని, ఇది ఏమాత్రం మంచి పద్ధతి కాదని అన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలోనే జనావాసాల మధ్య మృతదేహాన్ని పూడ్చివేసిన ఘటనపై ఉన్నతస్థాయి అధికారులతో విచారణ జరిపించాలని కోరారు. అలాగే రెవెన్యూ అధికారులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా పట్టణంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని కంచెలు వేసిన వాటిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, బాదుల్లా, ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్, ఏరియా కార్యవర్గ సభ్యులు బాలు, పి.వెంకటరమణ, పి.వి.రమణ, ఇమ్మానియేల్, పెంచలయ్య, విజయమ్మ, నాయకులు నాగరాజు, వెంకటేష్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ సంస్కృతి అంటే చాలా ఇష్టం



మాట్లాడుతున్న రష్యా దేశస్తుడు రాందాస్

పులివెందుల టౌన్ : భారతదేశ సంస్కృతి, అలవాట్లు చూడటంతో భారతదేశం పట్ల నాకు చాలా ఇష్టం ఏర్పడిందని రష్యా దేశం రుక్వేనియా ప్రాంతానికి చెందిన రాందాస్ పేర్కొన్నారు. సోమవారం పులివెందుల పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న నగరవనం పార్కును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో సూర్య నమస్కారాలు, ప్రాణాయామం చేసుకున్నారు. రాందాస్ వేసుకున్న చొక్కా కూడా జై శ్రీరామ్ నామాలతో నిండి ఉంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను చూసేందుకు ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు. పుట్టపర్తి సత్యసాయిబాబా శాంతి నిలయాన్ని సందర్శించి అక్కడి పద్ధతుల గురించి తెలుసుకున్నానని తెలిపారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో ఉన్న గండికోట, అహోబిలం ప్రాంతాలను చూడనున్నట్లు తెలిపారు.

ఒక్క హామీనైనా అమలు చేశారా?

- సూపర్ సిక్స్ గాలికి వదిలేశారు..
- పింఛన్‌లో కోతలు పెట్టి రూ.1000 పెంచారు
- ప్రతి నెలా సంక్షేమ పథకాల అమలు జగనన్న ఘనతే
- మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలవుతున్నా ఒక్క హామీనైనా అమలు చేసిందా? అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్‌తో పాటు 143 వాగ్దానాలు చేశారని, అయితే వాటిలో ఏ ఒక్క హామీనైనా నెరవేర్చారా? అని ప్రశ్నించారు. సామాజిక భద్రత పింఛన్ల పై సర్వేలు నిర్వహించి 1.80 లక్షల పింఛన్లు తొలగించి రూ.1000 పెంచడం ఏంటని నిలదీశారు. మరో 7–8 లక్షల పింఛన్లు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.1.30 లక్షల కోట్లు అప్పు చేశారని, ఆ డబ్బు ఏమి చేశారని ప్రశ్నిస్తే చెప్పే నాథుడే కరువయ్యాడన్నారు. ఇంత అప్పు చేసినా అభివృద్ధి, సంక్షేమం ఉనికే లేదని ఎద్దేవా చేశారు. ఎక్కడైతే లంచాలు, కమీషన్లు వస్తాయో అక్కడ ఆ నిధులను ఉపయోగించి రాష్ట్రాన్ని అథోగతి పాలు చేశారన్నారు. వైఎస్ జగన్ 12–13 లక్షల కోట్లు అప్పు చేశారని చంద్రబాబు అబద్ధాలు చెప్పి రాద్ధాంతం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 కంటే ముందు రూ.56వేల కోట్లు అప్పు ఉంటే చంద్రబాబు అధికారం చేపట్టి దిగిపోయే నాటికి రూ.3.78 లక్షల కోట్లు అప్పు ఉందన్నారు. అనంతరం జగనన్న అధికారంలోకి వచ్చి దిగిపోయే నాటికి రూ. 6లక్షల కోట్లు అప్పు ఉంటే జగనన్న ఎంత అప్పు చేశారో ప్రజలందరికి తెలుసన్నారు. అయితే ఆ అప్పుతో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఇసుక, మట్టి, గ్రావెల్, మద్యం అన్ని అమ్ముకుంటున్నారని, లోకల్ ట్యాక్స్‌లు విధించి సొంత ఖజానాలు నింపుకుంటున్నారని మండిపడ్డారు. మూడు సార్లు సీఎం, అపార అనుభవం అంటున్న చంద్రబాబు ఎప్పుడూ ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేసి తన బినామీలకు సంపద సృష్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో కూడా చక్కెర పరిశ్రమలు, కోఆపరేటివ్ తదితర వాటిని ప్రైవేట్ పరం చేసిన ఘనత కూడా చంద్రబాబుదేనన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జగనన్న హయాం వరకు కేవలం 11 మెడికల్ కళాశాలలు ఉండేవని, జగనన్న 17 కళాశాలలను తీసుకువచ్చి వాటి సంఖ్య 28కు పెంచగా వాటిలో అడ్మిషన్లు వద్దని చెప్పిన అనుభవజ్ఞుడు చంద్రబాబు అని విమర్శించారు. రిజిస్ట్రేషన్, కరెంట్ చార్జీలు పెంచడం సంపద సృష్టించడమా అని అడిగారు. మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. తాము పోరాటాలు చేసైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, గంగాధర్ రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, చెన్నకేశవరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, కొండారెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, సునీల్‌రెడ్డి, ఇస్మాయిల్, ఆంజనేయరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామలక్ష్మీరెడ్డి, రాజారెడ్డి, మోనార్క్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుబ్బయ్య

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో మండలంలోని గొళ్లపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవుని కడపకు చెందిన కంబాల సుబ్బయ్య (45) మృతి చెందారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. దేవుని కడపకు చెందిన సుబ్బయ్య తాడిపత్రిలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. సోమవారం తెల్లవారు జామున తన బైక్‌పై తాడిపత్రికి వెళ్తుండగా మార్గమధ్యంలో కమలాపురం మండలం గొళ్లపల్లె వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లి పోయింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో సుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కాగా మృతునికి భార్య శిరీష, చిన్న వయస్సు గల ఇద్దరు కుమార్తెలు, ఒక ఒక కుమారుడు ఉన్నారు.

రెండో మారు కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం రెండో మారు ప్రారంభించారు. నాఫెడ్ ద్వారా ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఈ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కందుల కనీస మద్దతు ధర క్వింటాలకు రూ.7550 చొప్పున ప్రకటించారు. ఈనెల 11వ తేదీన బీజేపీ నాయకుడు, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్ రెడ్డి ఈ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇదే కొనుగోలు కేంద్రాన్ని ఇదే స్థలంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఒకే కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ, టీడీపీ పార్టీ నేతలు వేర్వేరుగా ప్రారంభించడం గమనార్హం. ఈ విషయంపై సంబంధిత అధికారులను వివరణ కోరగా మార్కెట్ యార్డులో కందుల కొనుగోలుకు సంబంధించిన ఏజెన్సీ వ్యక్తిని మార్చడంతోనే ఎమ్మెల్యే ఈ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారని తెలిపారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తదితరులు

కలసపాడు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తెల్లపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కడప రమణారెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి హాజరయ్యారు. అనంతరం తెల్లపాడు, దూలంవారిపల్లె గ్రామాల్లో వైఎస్సార్ సమసమాజ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడవద్దని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు మాసాలైనప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కల్లబొల్లి మాటలు చెప్పి కాలయాపన చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉద్యానశాఖ రాష్ట్ర సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల అధ్యక్షుడు కె.రమణారెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, బి.నారాయణ యాదవ్, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పెద్దిరెడ్డి నారాయణ రెడ్డి, జి.నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

12 గ్యాస్ సిలిండర్లు, బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం



నిందితుడి అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ నాగార్జున

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గౌస్‌నగర్‌లో ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ సమీపంలో గంజికుంట కాలనీకి చెందిన షేక్ మహమ్మద్ అల్తాఫ్‌ను రెండు దొంగతనాల కేసుల్లో పోలీసులు అరెస్టు చేశారు. కడప డీఎస్పీ ఏ. వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కడప టూటౌన్ సీఐ బి. నాగార్జున, ఎస్ఐలు ఎస్.కె.ఎం.హుసేన్, సిద్దయ్యలతో కలిసి సోమవారం సంఘటన స్థలంలో తనిఖీలు చేశారు. అతనితో పాటు రూ. 80,000 విలువైన 10 గ్రాముల బంగారు ఆభరణాలు, 105.5 గ్రాముల బరువున్న రూ.10,000 విలువైన వెండి ఆభరణాలను సీజ్ చేశారు. మరో సంఘటనలో నిందితుడి వద్ద నుంచి రూ.26.400 విలువైన 12 గ్యాస్ సిలిండర్‌లను స్వాధీనం చేసుకుని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన సీఐ నాగార్జున, ఎస్ఐ, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ అభినందించారు.

సిబ్బంది సహకారంతోనే యూ డైస్ విజయవంతం

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని ఎంఈఓలు, సమగ్రశిక్ష, ఎంఆర్‌సీ సిబ్బంది సహకారంతోనే యూ డైస్ విజయవంతం అయిందని డీఈఓ డాక్టర్ షంషుద్దీన్, సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజులు పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని ఎస్‌పీజీ చర్చి సమావేశ మందిరంలో మండల విద్యాశాఖాధికారులు, మండల ఎంఐఎస్ కో ఆర్డినేటర్‌లు, కంప్యూటర్ ఆపరేటర్‌లు, అకౌంటెంట్లు, సీఆర్‌పీ (సీఆర్‌ఎంటీ)లకు యూ –డైస్ నమోదులో జరిగిన తప్పులను సరిచేసేందుకు, సమగ్ర శిక్ష వార్షిక ప్రణాళిక, బడ్జెట్ 2025–26 లకు సంబంధించి ఒక్క రోజు వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూ డైస్ లో జరిగిన తప్పులను ఎట్టి పరిస్థితుల్లో సరి చేయాలన్నారు. సమగ్రశిక్ష ఎంఐఎస్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ లక్ష్మీనరసింహరాజు మాట్లాడుతూ సమగ్రశిక్ష వార్షిక ప్రణాళిక, బడ్జెట్‌కు సంబంధించిన సమాచారం మండలాల నుంచి అప్‌డేట్ సమాచారాన్ని జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి అందించాలన్నారు. డీఈఓ కార్యాలయం ఏఎస్ఓ బ్రహ్మానందరెడ్డి, ఏపీఓ జాలాపతిలు పవర్ పాయింట్ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు వీరేంద్ర, దశరథరామిరెడ్డి, రమణమూర్తి పాల్గొన్నారు.

విలేకరిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టు యూనియన్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : పార్వతీపురం మన్యం జిల్లా మకువా మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై దాడి చేసిన అధికార తెలుగుదేశం పార్టీ నాయకుడు వేణుగోపాల్ నాయుడును తక్షణమే అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కూటమి నేతలు పాల్పడుతున్న అవకతవకలు, అక్రమాలను వెలుగులోకి తీసుకు వస్తున్నారన్న కక్షతోనే దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇలాంటి అల్లరిమూకలను టీడీపీ నాయకులు బహిష్కరించాలని కోరారు. దాడులు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేసిన సందర్భాల్లో ఏ సెక్షన్లు వర్తిస్తాయో పాత్రికేయులపై దాడి చేసిన వారిపై కూడా అవే సెక్షన్లను వర్తింపజేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక చట్టం తీసుకు రావాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా గౌరవాధ్యక్షుడు భూమిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, ఏపీడబ్ల్యుజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్‌రాజు, ప్రధాన కార్యదర్శి నూర్‌బాషా, జర్నలిస్టు సంఘాల నాయకులు కాటిబోయిన నారాయణ, రామాంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం సమర్పించారు.